# 2
# సావుదప్పు

అప్పటికి ఆ వార్త దోసలగూడెంను చుట్టుముట్టింది. కొందరు చిలుక్కొయ్యలకున్న దప్పుల్ని దులుపుతున్నరు. కొందరు ఈత కట్టెతో చిటికె పుల్లను చేస్తున్నరు. మా నాయినైతే దూపయినప్పుడే బాయి తవ్వుతనంటడు. అప్పటికప్పుడు సంద్ర కట్టె ఇరుసుకచ్చి దప్పుకోలను చేస్తున్నడు. ఏ ఇంట్లోనో దప్పుమీద చిటికె పడనే పడ్డది. గూడానికి గూడెం ఏదో యుద్ధానికి ఆయుధాలు నూరుతున్నట్టుగ ఉంది.

"ఏమాయెరా.. బొంతపురుగోలే ఎటూ జరుగవు. దప్పుచెక్క యాడుందో సూసుకుంటె తప్పా! అదిగూడ నేనే సూసియ్యాలెనా?" అవ్వ గదమాయింపుకు ఉలికిపడి పక్కకు జరిగిన. సానుపు సల్లుతుంది. సల్లుతూ సల్లుతూ నాదిక్కు కోపంగా చూసింది అవ్వ. నాయినైతే దీక్షగా గాజు పెంకుతో కోలను నున్నగా గీకుతున్నడు.

నేను యాపపుల్ల నములుకుంట బయటకచ్చిన. ఇద్దరూ నావైపు ఉరిమినట్టు చూస్తున్నరు. ఎట్లయినా తండ్రి కొడుకులిద్దరినీ దప్పులిచ్చి పంపియ్యాలని మా అవ్వ ఎప్పుడో నిర్ణయించుకున్నట్టుంది. "యాడికి పోతున్నవో జెట్టనరా" అన్నది సానుపు చల్లుతూనే. నేను బయటికచ్చినిలవడ్డ.

ఆ నిర్ణయానికి బలమైన కారణం గూడా ఉంది. ముసిముసి ముబ్బులనే పటేండ్ల జీతగాడు ఊర్లెనుంచి గూడెంకచ్చిండు. పోతూ పోతూ మా ఇంటి దగ్గెర కాలాపి 'ఆటాడుకుంట మంచిగ

తీసుకపోవాలనుకున్నరు. ఐదారువందలదాక చిల్లర ఇడిపిచ్చి జమ చేసింగ్రు' అన్నడు. అవ్వకు కంట్రోలు బియ్యం యాదికచ్చినయి.మంచి మోకా తలిగిందనుకుంది.

ఎక్కడోల్లు అక్కడ నిమిషాల మీద దప్పులు సదురుకుని ఊరు దిక్కు కన్నేసికూసున్నరు. నాకు కాళ్ళు చేతులు గుంజుతున్నయి. యాప చెట్టు కింది గుండు మీద కూసున్న. నాకు లోపల దడదడనే ఉంది. ఎట్ల ఎగురాలెనని.

"పోషన్నా ...ఏరి? ఎవ్వలు రాకపోయిరి! నిజమా కాదా! ఈ రొయ్య కాళ్ల కిట్టిగాడు ఎటు చూసిండో! శాతమిదేనాయె. నీకన్నా చెప్పాలెగద...?" పక్కింటి బుచ్చన్న అనుమానంగా అడుగనే అడిగిండు.

మా నాయిన గాజుపెంకుతో చిర్రకోలను గీరుకుంటనే "వాళ్లదేం బోయింది! యాల్లకచ్చి ఇంతమంది గావాలె. అంత మంది గావాలె అంటరు. పనికిపోతరు ఊరికి పోతరు. జర ముందుగల్ల చెప్పుదామన్న గ్యానముండది" అన్నడు.

అంతట్లనే మా అవ్వ, " సచ్చినోడు సన్నపోడు గాదు. వట్టిపాపపు ముండకొడుకు. కండ్ల ముంగట అడిది కనవడపాపం. సంటిపిల్లలకు పాలిచ్చే తల్లులు పగటియాల్లన చేండ్లనుంచి ఊర్లెకుపోను భయం. ఇరువై ఏండ్ల కింద గిట్లనే! సచ్చిండు సచ్చిండని సుట్టాలందరికి చెప్పిపంపింగ్రట. అందరచ్చే వరకు లేచి కూసున్నడట. కొంపలగుత్తొడు" అన్నది. సానుపు జల్లుకుంటనే.

" ఏమన్నగాని, ఇంకో అద్దగంట చూసి బాయి పూటికె తియ్యవోత. యాల్లకచ్చి ఐదారుగురు సాలంటే పొద్దంత చేతులు ముంగట వెట్టుకుని కూసోవాలె" అన్నడు బుచ్చన్న.

అవ్వ సానుపు కుండతో ఇంట్లకుపోయింది. కోలను తిప్పి తిప్పి చూస్తున్నడు నాయిన. బుచ్చన్న దౌడలు సప్పరిత్తండు. నాకు జరమచ్చినట్టయింది. రెండురోజులన్న కాలేదు శాలరాములు పీనుగును సాగనంపి. ఆనాడే సాలుసాలయింది. పాణమంత కూని కూనయింది.

మా గ్రూపుల తొవ్వ దీసేది నేనే! నా నొసలు ఎత్తుగా చెక్కలెక్క సక్కగుంటది. నేలమీది చిల్లర పైసలు నేనే అందుకోవాలె. జంబుదుకం గట్టి ఆడాలంటే నేనే దప్పు సైర జెయ్యాలె. కొత్త ఆటను నేనే మొదలువెట్టాలె. నడుమ నడుమ సీటి గొట్టాలె. సావు దప్పుకు పోయిన్నంటే సచ్చిన సావే.

"ఏమాయెరా! మొఖం కడుక్కోని బుక్కెడు సల్లవడుదువుదా! యాల్లకు ఆగంజేత్తవా" అవ్వ గదురాయించింది. సావుదప్పుకు ఉద్దెర లేదు. వాగులనే పైసలు పంచుతరు. మా అవ్వకు అదే ఆశ.

" నీయవ్వ...కడుపు నొత్తంది. కాళ్లు చేతులు గుంజుతున్నయి...." నా మాటలు పూర్తికానేలేదు. ఎక్కడ నేను పోనని మొండికేత్తనో అని ముందుగనే సుదురాయించుకుంది మా అవ్వ " ఓకిలిచ్చి

మొఖం గడుక్కో అన్నీ పోతయి. బుక్కెడు సల్లవడు. మొన్నటి లెక్క ఉక్కుంట పోయి ఉక్కుంట రాకుంఁడ్రి. కట్టం జేసినప్పుడు కొట్లాడి అడుక్కోవాలె. ఇయ్యల్ల నన్న కంట్రోలుబియ్యంకు మొరత్తదోలేదో!రెండ్రోజులు లేటయితే అయిపోయినయంటడు" అన్నది గట్టిగా.

నాకు గాక మా నాయినకు చెప్పినట్టుగా ఉన్నయి ఆ మాటలు. యాపపుల్లను ఇసిరికొట్టి ఇంట్లకు నడిచిన.

అప్పుడే ఒక రైతు డాంబర్‌రోడు మీదికచ్చిండు. "దప్పులోల్లు రాండ్రిరా. చిన్నగోపాల్‌రావు బాపు కాలం జేసిండు. ఆటకాల్లు రాండ్రి. ముసలి ముడిగోల్లు వద్దు." అన్నడు.

చెప్పేది ఎవలో చూద్దామని బయటకచ్చేసరికి సైకిల్ ఊరి వైపుపోతుంది. వచ్చింది ఎవలురా అని మా అవ్వ గూడా అప్పుడే బయటకచ్చింది.

"గా ఒర్రువోతోని మాటలు నమ్మకుండ్రి. అసలోల్లు రావాలె. వాళ్ళు వచ్చి చెప్పేదాక ఎవ్వలు పోకుండ్రి. మొన్న ఉరుకులాడుకుంట పోతే ఏమైందో ఎరికేగదా"అన్నది అవ్వ. ఆ మాటలే తమ నిర్ణయమన్నట్లు అందరూ తలూపిండ్రు.

అదికూడా నిజమే. ఇంటి మనుషులు వచ్చి చెప్పేదాక పోవద్దు. చెప్పినోళ్ళు నడుమలనే పోతరు. పైసలిచ్చేటప్పుడు ఇంటోళ్లు ఇంతమంది ఎందుకచ్చిండ్రంటరు. శాలరాములు సావు గట్లనే అయింది. ఎవలో వచ్చి చెప్పిండ్రు. కాష్టమైనంక ఎవలంతల వాళ్ళు జారుకున్నరు. నలుగురన్నదమ్ముల పొత్తు. నువ్వంటే నువ్వనుకున్నరు. ఒత్తి పట్టి అడిగితే "ఇంతమంది ఎందుకచ్చిండ్రు? ఎవలు రమ్మన్నరు? పైసలు పున్యాని కత్తయనుకున్నారా' అన్నరు.

మా నాయినది రేషం పుట్టువాడి "చల్ నడువుండ్రిరా! ఇయ్యకపోతే ఇయ్యకపోయిరి. కుషీ కొద్ది వచ్చినమనుకుందాం. దిక్కుమొక్కులేని ఎన్ని పీనుగులకు వట్టిగ కొట్టలేదు" అన్నడు.

ఇంటికి వచ్చినంక మా అవ్వ ఒక్కటే తిట్టుడు. కంట్రోలు బియ్యం ఆ రోజే తెచ్చేది.

పొద్దు పొడిచి బారెడెక్కింది. ఊరు మా గూడెం ఆనుకునే ఉన్నా మా ఇంటికి బాగానే దూరం. మా అవ్వ బలిమి మీద నాలుగు బుక్కలు తిని కూసున్న. మా గ్రూపు ఒక్కొక్కరే యాపచెట్టు కింద జమయిండ్రు.

"వీళ్ళేరి...? ఎవ్వలు రాకపోయిరి? ఎంత మందిని రమ్మంటరో తెలువది" - బుచ్చన్ననే అన్నడు.

"ఏమో! బ్యాండు సప్పుడు మాట్లాడుకున్నరేమో! పట్నం మనుసులు!" నేనన్న.

అందరు నవ్విండ్రు. "అదేం పెండ్లి కార్యమనుకున్నావురా?" అన్నరు. పట్నం మనుషుల

మీద కొందరికి అనుమానం కూడా వచ్చినట్టుంది. "బ్యాండు సప్పుడున్నా దప్పులుండాల్సిందే" అన్నరు.

"గోపాల్‌రావు పటేల్ ఊర్లె నుంచి పోయి పదేండ్లు దాటిందా...?" ఎవరో అడిగింద్రు.

"ఎవని పదేండ్లు... ఇరువై ఏండ్లయింది. వాళ్ల చిన్న బిడ్డ పుట్టుకల పోయిందు. మొన్ననే లగ్గం జేసె." ఎవలో అన్నరు.

"ఏ...యాడిదిరా ఇరువై ఏండ్లు. మాటమాట్లాడితే అంతుండది. పొంతుండది. పోయేముందు వాళ్ల శాతల నేనే జీతముంటి. అప్పుడు నాకు పెండ్లే కాలేదు. వడ్లకుప్ప కావలి. అప్పుడే కొత్తపెల్లి రథం. రాత్రికి రాత్రి రథం జూడ పోయిన. అదే రాత్రి మల్ల మర్రిన. వచ్చే వరకు తెల్లారింది. వడ్ల కుప్ప ఇడిసి పెట్టి ఎటుపోయినవురా అని సరికట్ట అందుకుని కల్లంలనే ఇరుగ సంపిందు. అదే పోవుడు బొంబాయి దెంక పోయిన. యాడాది దాక రాలేదు. అగో...అదే యేడు పోయింద్రు. పదిహేనేండ్లు అయితుంది"- మా చిన్నాయిన అన్నడు.

" ఔ...గప్పుడే...మా పెద్దోనిపుట్టుకల." నన్ను చూపిస్తూ అన్నడు మా నాయిన.

" ఓ పదిరువై ఏండ్లు ఊరిని అడలాయించిందు. నీళ్లు మింగనియ్యలేదు. ఆడిది కంట్లెవడ పాపము. శాతలకు శాతలు ఎట్టివడుతుండె" బుచ్చన్న అన్నడు.

అనుకుంటనే అప్పుడప్పుడు లేచినిలబడి ఊరి దిక్కు చూస్తున్నడు. బుచ్చన్న పాణం తొక్కులాడుతుంది. దప్పుకొరకు సూసుకుంట కూసుంటే కైకిలి యాల్లదాటిపోతదేమోనన్న భయం.

"బుచ్చన్న...నువ్వు పోరాదే! కైకిలియాల్ల దాటిపోతది. వీళ్లు దప్పుగొట్ట పిలుత్తరో లేదో! అటుగాకుంటయితవు ఇటుగాకుంట అయితవు" అన్న.

బుచ్చన్న లెవ్వలేదు. నవ్వి కూసున్నడు. నామాటలిన్నంక " ఔ...నువ్వు పోతెనన్న వత్తరో ఏమో! " అన్నడు మా చిన్నాయిన పరాషికమాడుతు. అందరూ నవ్వింద్రు.

నాకు మాత్రం చిత్రమే అనిపించింది. అక్కడ జమ కూడిన పదిహేను మందిలో పది మంది దాకా కైకిలి పోయేటోల్లే! ఇయ్యల్ల పోరని తెలిసిపోయింది.

"నాకు అర్థంగాదుగనీ దప్పుకొట్టవోతే కైకిలి పోయినదానికంటే ఎక్కువ పైసలేం రావు. పైగా పెయ్యంతా కూనికూని. ఎగిరి దుంకితే రెండు రోజులదాకా లెవ్వరాదు. అయినా దప్పు కొట్టుడుకే పోత మంటరు ఎందుకు?" అడిగిన.

అందరూ నాదిక్కు చూస్తున్నరు. ఎప్పుడూ ఆ ఆలోచన రానట్టే ఉన్నది. కొందరు తేలిగ్గా చూసింద్రు. మా నాయిన ఏదో కసురుకోవోతుంటే నేను వినిపించుకోకుండానే అన్న.

"ఇచ్చినా ఇయ్యకున్నా...కాళ్లు నొచ్చినా కడుపు నొచ్చినా పోవాలనే మనసు గుంజుతది. అక్కడ ఎగిరిత్తరు దుంకిత్తరు. నోరు ఎండుకపోయినా దొక్కవడివెట్టినా చారెడు మంచినీళ్లు ఇయ్యరు. దినాల నాడు కొనవాకిట్ల అడుగు బొడుగుది ఉంటే ఏత్తరు. లేకుంటే లేదు. ఎన్నడన్న మేముదప్పు కొట్టరామని అందరు ఊకున్నరా...? చెడ్డోడు మంచోడు ఎవడన్న గాని దప్పులు రాక పీనుగు నిలవడ్డదా....? ఈ హింసను ఎందుకు భరిస్తున్నం" అన్న. ఎందుకోగనీ నా కంఠంల తీవ్రత. ఎంత ఆపుకుందామన్నా ఆగలేదు.

"అందుకే నిన్ను బడినుంచి ఎల్లగొట్టింద్రురా!" బుచ్చన్న అన్నడు.

"నీకు వంగలేక మందిని వద్దంటున్నవు. ఈ దప్పు ఇయ్యాల్లగాదు. కులకషిపి. పుట్టిన్నాటినుంచే ఉన్నది. ఎవల నీతి వాల్లది" మా చిన్నాయిన అన్నడు. నేను ఏదో చెప్పబోతుంటే స్కూటర్ హారన్ వినిపించింది.

"అరేయ్...ఏమాయెరా! ఇంక ఎంతమందిని తోలియ్యాలె. ఇగ వత్తరో అగ వత్తరో అని మేం ఎదురుసూత్తున్నం. మీరిక్కడ మీటింగులు వెట్టింద్రు. వత్తరా రా రా... " పటేలు పెద్దకొడుకు బండి దిగుతూ కోపానికచ్చిండు.

అందరం లేచి నిలవడ్డం. మా నాయిన ఆగమాగాన దగ్గెరికిపోయి "దండం పటేలా" అన్నడు. పబ్బతివట్టి "ఎవలు పటేలా..? ఎవ్వలు కాయంగ చెప్పకనే పోయిరి. ఎన్నిదప్పులు...ఎంతమంది తెల్వకనేపాయె. ఇప్పుడు నేనే వత్తామనుకుంటున్న" నసుగుతూ అన్నడు మానాయిన.

"ఎందరేందిరా! ఆటకాల్లు ఎందరుంటే అందరు రాంద్రి. ఆడుకుంట పాడుకుంట పోవాలె" అన్నడు.

"పెద్ద పటేలు మంచిగనే ఉండె. అనుకోకుంట గిట్లైల్లయిందయ్యా! మొన్నోసారి మాఘమాస జాతర కచ్చినప్పుడు మంచిగ మాట్లాడిండు" మందిలోంచి ఎవలో అడిగింద్రు.

"పటేలు మమ్ముల్ని కరవుల కాలంల ఆదుకున్నడు. నీడకు తీసిండు. ఆత్మగుణం. పుట్లకుపుట్ల కల్లం జీతగాల్ల మీదనే నమ్ముతుండె. పెద్దగుణం." బుచ్చన్న అన్నడు.

"పెద్ద పెద్ద దవాఖాన్లు తింపినం. మస్తు ఖర్చు చేసినం. మూడురోజుల నుంచి కోమాలనే ఉన్నడు. సచ్చినంక ఊర్లెనే పారెయ్యాలని ఎప్పుడూ అంటుండె. మా సుట్టాలందరు వద్దన్నా బలవంతంగ తీసుకచ్చిన" ఒక కాలు బండిమీద, ఒక కాలు భూమ్మీద. "రాంద్రి రాంద్రి. పొల్లగాండ్లు ఆకలికి ఆగరు. జెట్టన పోయి రావాలె" అంటూ గేరు మార్చుకుని పోయిండు పటేలు పెద్దకొడుకు.

అందరి మొఖాల్లో ఆనందం. కైకిలి పోయేటోల్లకు ఏదో బరువు దించుకున్నట్టయింది.

"ఎంతైనా బారి గుణం బారే! ఏమన్న కొసిరిండా.... బ్యార మాడిండా! ఎందరుంటే అందరిని

రమ్మన్నడు" ఎవలో అన్నరు.

మా చిన్నాయిన, "రేటుగూడ చెప్పేదుండె" అని మా నాయినతో అన్నడు. బుచ్చన్న మరో ఇద్దరు ముగ్గురు నిజమే అన్నరు.

"ఏం మాట్లాడత్తదిరా! బుర్రన ఉరుకనేవట్టె! అయినా ఇద్దరు రాండ్రి ముగ్గురు రాండ్రి అంటే ఎంతిత్తవని అడుగచ్చు. బుద్దున్నంత మంది రాండ్రి అన్నంక ఏం అడుగుతవు. ఇయ్యడా...పా !" అన్నడు నాయిన.

ఎక్కడోల్లక్కడ దప్పులు పట్టుకుని బయిలెల్లింన్డ్రు. నాకు ఈపుల నొప్పి మొదలయింది. కడుపుల బరబర మండుతుంది. అట్లనే కూసున్న.

మా అవ్వకు కోపమచ్చి " ఏమాయెరా! పోవా! నీకు వేరే బొట్టువెట్టి పిలుత్తరా! పల్లకి పంపుతరా!" అంటూ చెంబుతో మంచినీల్లిచ్చింది. కోపంగా నీల్లు తాగకుంటనే దప్పు అందుకుని బయటకచ్చిన. అప్పుడు మల్లా యాదికచ్చి ఇంట్లకుపోయి కాళ్ల గజ్జెల శేర్లు తెచ్చుకున్న.

"అందుకున్నయి అందుకున్నట్టు వాళ్లకు ఇయ్యకు. ఐదు రూపాయల బిల్లలున్నయట. యానంగనన్న నాలుగు జేబులేసుకరా!" మా అవ్వ మెల్లగా అన్నది. అంటూ మల్లోసారి నీల్లిచ్చింది. తాగకనే బయటకచ్చిన. దప్పు భుజాన ఏసుకుని రోడ్డు మీదికచ్చిన. కాల్లు గుంజుతున్నయి.

ఈ దప్పు నాకు కొట్టరాకున్నా మంచిగుండు. అప్పుడు మురిపానికి నేర్చుకున్న. ఇప్పుడు వాళ్ల సావు ఏమోగానీ నా సావు గావట్టె. పైసలు నొసలుతో అందుకుంటే కడుపుల పేగులు నోట్లె కత్తయి. నాలికె ఎండుకపోయి దూపయితది. చెంబెడు నీల్లు ఉండుగద మంచిగుండు అనుకుంట. నీళ్లు ఎవలిత్తరు?

పెద్దోల్ల పీనుగైతే మరీ భయం. చిల్లర సల్లుకుంట ఎగిరిత్తరు దుంకిత్తరు. మస్తు లేటు జేత్తరు. నాలుగడుగులు దబదబ ఏత్తే మల్లా ఎనుకకు నూక్కత్తరు.

కచీరు కాడికి రాకముందే దప్పుల సప్పుడు ఇనవడ్డది. ముందుగల్ల పోయినోల్లు అందుకున్నట్టున్నరు. నడుమల కూడితే అదో తప్పు. దబదబ నడిచి మందిల కలిసిన.

పాడె తయారైతంది. తలారోడు కట్టెలను అల్లిబిల్లి కడుతుండు. మంది బాగనే జమయింన్డ్రు. వచ్చేటోల్లు వత్తంన్డ్రు. పోయేటోల్లు పోతంన్డ్రు. ఏడ్పులు అరుపులు లెవ్వుగనీ ఆడిపిల్లలు తలాపుకు కూసుండి బీరిపోయింన్డ్రు.

పది దాటినంక పీనుగులేశింది. ఊదుబత్తీల పొగ. ప్యాలాలు సల్లుతున్నరు.

"బాలీ...మా పెద్ద చెల్లె బిడ్డ అందలేదురా! మెల్లెగ ఆడుకుంట పాడుకుంట పోని. వాగులకు

పోయేవరకన్నా వత్తది" పటేలు చిన్నకొడుకు మా నాయినతో అన్నడు. నాయిన తలుకాయ ఊపిండు. ఇది ఎప్పుడు జరిగేదే. అందరు వచ్చేదాక ఆపరు. నడుమలకు పోయినంక 'మెల్లగ పోనీ వాళ్లు వీళ్లు అందాలె' అంటరు.

సంది దాటి రోడు మీదికచ్చినం. ముందు దప్పులు. ఎనుక శవం. మా ముందు జీనుపైంట్ల పోరగాండ్లు. పటేలు బలుగం అందరున్నరు. ఆగమాగం జేత్తంద్రు. పెండ్లి భరత్ తీసినట్టు జేత్తంద్రు. నేను దప్పు సైరగొట్టి జంబిడుకం అందుకున్న. నా ఎనుక అటో లైను ఇటో లైను. ముందుకు ఎనుకకు పక్కకు ఎగురుకుంట తిరుగుతుంద్రు. మంచి ఊపు మీదికి వచ్చినంక సీటి గొట్టిన.

పటేండ్ల పిల్లగాడు జేబులనుంచి చిల్లరపైసలు తీసి. జి.ఆర్. అనే అక్షరాల రూపంల పెట్టిండు. ఇంతకుముందు ఒకటి మీద ఒకటి పెడుదురు. లేదంటే మట్టిల ఇసిరేత్తురు.

పిల్లగాండ్లు పక్కకు జరిగి వింతగా చూస్తుంద్రు. నేను బిల్లలనే చూస్తున్న. అన్నీ చారాన బిల్లలే! మా చిన్నాయిన అందుకో అని కండ్లతోనే సైగ జేసిండు. అందరు గుండం గట్టింద్రు. నేను నడుమలకు పోయి దప్పు కొట్టుకుంట వంగి నొసటితో అద్దుకున్న. చారాన మట్టిలో కూరుకపోయింది. నొసటికి ఇసుకరాల్లే అంటినయి. పిల్లగాండ్లు నవ్వుతున్నరు.

మరోసారి వంగిన. అందలేదు. చెయ్యితో ఏరపోతుంటే ఎవలో "ఒరేయ్ గదేంది" అన్నరు. మల్లీ వంగిన. నొసలుకు పట్టిన చెమటను తుడుచుకున్న. కండ్లల్ల ముక్కుల దుమ్ము. మోకాల్లకింద ఇసుకరాల్లు. అయినా బిల్లలను ఏరి మా చిన్నాయినకిచ్చిన. ఎగురుకుంట లైను కలిపిన.

మల్లీ అదేపిల్లగాడు. అక్షరాల రూపంలో పైసలు పెడుతుంటే మా నాయిన తువ్వాల పరిచిండు. ఇంకో పిల్లగాడు తువ్వాలను ఇసిరికొట్టి మట్టిలనే పైసలు పరిచిండు. నేను చూస్తున్నది అది కాదు. ఏ బిల్లలని!

అన్నీ చారానలే! అయిష్టంగా అటువైపు చూడలేదు. తప్పడ తప్పడ దప్పు మార్చి సైర మార్చిన. రెండు లైనులు గట్టి గుండ్రంగా ఒక్కజాగలకు వచ్చి విడిపోయినం. ఎగురుకుంట చుట్టూ తిరుగుతున్నం.

అందుకో అన్నటు సైరజేసిండు మా చిన్నాయిన. నాకు అప్పటికే దిగపార చెమటలు. దూప మొదలయింది. నా భయమే అది. పెదువుల్ని తడుపుకుంటూ వంగిన. ఒక్కొక్క పైసను అందుకుంటూ లేచి నుదుటి మీది నుంచి తీసుకుని మల్ల వంగుతున్న. నెత్తి దిమ్మంటుంది. నాకు ఏయే నొప్పులు ఉంటయో అవన్నీ మొదలయితున్నయి. జరం రాకపోతే ఇంత ఆయాసం ఉండకపోతుండె.

జరంత సేపన్న ఆగుతలేరు. ఒకలు దప్పితే ఒకలు. అదే చారాన బిల్లలు. గీత లెక్క పెట్టిండు. ఒక బిల్లను అందుకోవడానికి నేను వంగిన. నా నడుము మీద ఇంకో బిల్లను పెట్టింద్రు. లెవ్వపోతే ఎవలో బాలువట్టి వంచింద్రు. మా చిన్నాయిన దాన్ని అందుకోబోంతుంటే ఇంకో బిల్లను అయన

ఈపు మీద పెట్టింద్రు. అందుకోని లెవ్వబోతుంటే బూరువట్టి వంగవెట్టి అయిన వీపు మీద ఇంకో పైస.

కిందోన్ని కిందనే ఉన్న. సగం మందిని వంగవెట్టింద్రు. ఇంకో పైసను అందుకోనువోతుంటే ఇంకో రౌండు. పైసపైసకు వంగ వోతుంటే వీపు మీద పైసలు. అద్దగంటకుపైగా లేసుడు వంగుడు. నడుము టింగుమన్నది. మా చిన్నాయిన అంగిజేబు నిండింది.

పొల్లగాండ్లు జేబులు దులుపుకున్నరు. 'ఇగ పీడ పోయిందిరా! చిల్లర అయిపోయినయి' అనుకున్న. సైర మార్చి రెండు లైన్లు పక్కకు తిరిగి ఎదురెదురుగా నిలవడ్డం. ఎనుకకు ముందుకు ఎగురుతున్నం.

జీన్ప్యాంటు పిల్లగాడు మా చిన్నాయిన దగ్గరికచ్చి పదిరూపాయల నోటు ఇచ్చి చిల్లర మొత్తం తీసుకుని జేబుల పోసుకున్నడు. ఒక్కొక్క పైస....కుక్క ముందు రొట్టె ముక్కలెక్క ఇసురుతుండు. నన్ను లెవ్వనిత్తలేదు. తువ్వాల పరువనిత్త లేదు. దుమ్ము నిండిన తొవ్వ.

నాకు ఈపులకు బొచ్చెలకు నొత్తుంది. ఎండ ముదిరింది. చెమట కారికారి ఆగిపోయింది. నోరు ఎండుకపోయింది. ఎగుర చాతనైత లేదు. ఎంత ఉషారుగా అందుకుందామన్నా ...చారాన బిల్ల మన్నులకు సొచ్చుక పోతుంది. నొసటి తోనే మట్టిని జరిపి తుడుసుకుని అందుకుంటున్న.

నా ఆయాసం మా నాయిన చూసిందు. బలవంతం మీద తువ్వాల పరిచి పైసలన్ని ఏరి అందులో ఏసిందు.అప్పటికి నాలుగు ఇండ్లు గూడా దాటలేదు. ఇంకో రెండు మైళ్లదూరం. ఇట్ల వంగి లేత్తే పటేలుతో నేనుగూడా కాటికివోత.

తొవ్వ సాగాలని దబదబ ముందుకు నడిచిన. నాలుగు అడుగులు ముందుకు వెయ్యనే లేదు. ఎవలో అడ్డమచ్చి 'మెల్లగ పోనీ' అన్నరు.

ఎనుక నుండి ఎవలో 'నడువని నడువని. పిల్లగాండ్లు గావరైతరు' అన్నరు. వాళ్లకు వీళ్లకు తాకులాట. అందరినీ అదిలిచ్చిన పిల్లగాండ్లు మల్లా దప్పులను నిలవెట్టింద్రు.

మా గ్రూపుల అందరూ చెయ్యి తిరిగిన దప్పుకాల్లే. కొట్టి కొట్టి రగుదు మాలినోళ్లు. ఎటచ్చీ నేనే పిల్లగాన్ని. నాకున్న ఆయాసం వాళ్లకు లేదు. కొద్దిసేపు దప్పును ఆపి పక్కకు జరిగిన. నా అయాసం చూసిన అందరూ నన్ను విడిచి జంబూదుకం కట్టింద్రు.

ఆయాసంతో ఎగపోత పుట్టింది. మట్టిల చారాన బిళ్లలు రాలుతున్నయి. తలారి కొమురదు, బట్టలుతికే శాత సాకలోదు ఎంబడే ఉన్నరు. నన్ను చూసి దున్నపోతోలె ఉన్నవు ఏమైందిరా ఆదు...' అని ముందుకు నూకింద్రు. పిల్లగాండ్లు చిన్నోడినని నా ఎంబడే పడ్డరు. నన్నే అందుకొమ్మన్నరు.

పొద్దు నెత్తిమీది కచ్చింది. కాళ్లు కాలుతున్నయి. కల్లు దుకాణం ముందు ఆగినం. వరుసగ

పన్నెండు  కల్లుసీసలు పెట్టింద్రు. ఆడుకుంట దప్పు ఆపకుంట నోటితో సీసను అందుకోవాలె. సీసలు గాల్లోకి లేత్తున్నయి. పండ్లతో బిగవట్టి తల పైకెత్తి తాగుతున్నరు.

నాకు ఒక్కటే దూప. కార్యాలు ఎండుకపోయే దూప. దప్పును ఆపి చేతితో అందుకుని పక్కకుపోయి నోట్లె వంపుకున్న. రెండు బుక్కలు మింగకముందే ఎవలో సీసను గుంజి దూరం ఇసిరికొట్టింద్రు. ఇంకో సీస తెచ్చి ముంగట వెట్టి అందుకుని తాగుమన్నరు. పోరగాండ్లంత నాసుట్టు సుట్టుకుని సీటి కొడుతంద్రు. దూపకొరకైనా అందుకోవాలనిపించింది.

నోటితో  అందుకుని పైకెత్తి తాగుతుంటే ఒక్కసారి కల్లు మొత్తం గొంతులకు జారి సరానవడ్డది. దమ్ము తియ్యరాలేదు. మింగరాలేదు. సీసను ఇడిసిపెట్టి పక్కకు నడిచిన. కల్లుతో అంగి నానింది. దమ్ము రాక ఆగమాగమయింది. దగ్గు ఏగేసుకచ్చింది.

పదినోటు మా చిన్నాయిన జేబులోకి చేరి చిల్లర బయటకు వత్తుంది. నేను అందుకోనని పక్కకు జరిగిన . మా నాయన కొద్దిసేపు చిన్నాయిన కొద్దిసేపు...అటో ఇటో ఊరు దాటిచ్చింద్రు.

నాకు నెత్తినొప్పి మొదలయ్యింది. కాళ్లు కూలవడుతున్నయి. పిక్కలు గుంజుతున్నయి. చెంబెడు నీళ్లయితే బాగుండుననుకున్న. తొవ్వపొంటి ఓటలు కూడాలేదు. పటేలు మనుమరాలు కొరకు బాగనేలేటయింది. అయినా రాలేదు.

దింపుడు కల్లం కాడ పీనుగు దిగేవరకు నేను కూలవడిపోయిన. గుండుకు ఒరిగి పీనుగునే సూస్తున్న. పీనుగుమీది కొనికె పోగు, బంగారు గుండీలు తీస్తున్నరు. కాలుకు వెండికడెముంది. ఎంత తీసినా రాలేదు. తలారోడు అది నాకే అని కొట్లాడుతున్నడు. శవం కాలినంక రేపు కాటిలో బూడిది గెలికి ఏరుకపోతడు.

మా నాయిన లొట్టిల నీళ్లు తెచ్చి, “ నర్సిమ్మా బుక్కెడు తాగు. నీ ఈడు పోరగాండ్లే! గోసజేసిరి. చారాన బిల్లలు ఎన్నిరోజులు కూడ వెట్టింద్రో” అన్నడు. పక్కనే కూసుంటూ బాధగా.

లొట్టిని అందుకుని గట్టగట్ట తాగిన. కాడు కనవడుతుంది. నాలుగడుగులే! ఆ నాలుగడుగులూ దప్పుతో సాగనంపాలె. సొలుక్కుంట లేచిన. ఇయ్యాల్ల కంట్రోలు బియ్యం కచ్చితంగా తీసుకపోతున్నాననే తృప్తి!

పీనుగును ‘గోవింద...గో...విందా’ అనుకుంట ఎత్తింద్రు. ఎత్తుతూ ఎవలో ఆపింద్రు. ఆపి పెద్దగా అరిచింద్రు.

‘అరే...పటేలు కదులుతుండు. ఆపుంద్రి. ఆపుంద్రి.’ అని.

పాడె కిందికి దిగింది. నిజంగానే పటేలు చెయ్యి కదిలింది. కాలు కదిలింది. కనురెప్పలు కదిలినయి.

" అరే..నిజంగనే పాణముంది. ఒకసారి ఇట్లనే చేసిండు. పాడె మీదినుంచి లేచి కూసున్నడు." అన్నరు.

నా మెదడు మొద్దుబారింది. ఎర్రి చూపులు సూస్తున్న. తొందర తొందరగా పాడెఇప్పి పటేలును నీడకు తీసుకపోయిండ్రు. మొకం మీద నీల్లు కొట్టిండ్రు. నోట్లె నీల్లు పోసిండ్రు. పటెలు అటునుండి ఇటు బొర్రిండు.

సెల్‌ఫోన్‌లు మోగినయి.నిమిషాల మీద కార్లు వచ్చినయి. అంతా కీకెలు బొబ్బలు. "బాపూ...పటేలా...తాతా...." ఎవరి వరుసన వాళ్లు కేకలేసి పిలుత్తండ్రు. పటేలు గుడ్లు మిటుకరిత్తుండు.

దూప ఆరక ఇంకో బుక్కెడు తాగుదామని లొట్టి ఎత్తిన. ఎండకాలం. మడుగుల నీళ్లు. అంతా మన్ను నాసు. కడుపుల తింపినట్టయింది. బుడుగ్గున కక్కుకున్న. బుక్కెడు రక్తం. మా నాయిన లబలబ మొత్తుకుంట ఉరికచ్చిండు. మల్లోసారి బుక్కెడు రక్తం. గిర్రున తిరిగి అడ్డం వడ్డ. అడ్డం వడుతూ కారు దిక్కు చూసిన.

పటేలును దవఖానలకు తీసుకపొమ్మని ఎవలో అన్నరు. ఎంటనే కార్ల ఎక్కిచ్చిండ్రు. నా మెదలు వాలిపోయినయి. నన్ను చేతుల వట్టుకుని, "పటేలా...జర ఊర్లెదాక ఎక్కిచ్చుక పొండ్రి" అని బతిలాడుతుండు మా నాయిన.

కార్లు వెల్లిపోతున్న చప్పుడు. నేను మా నాయిన చేతుల్లోనే ఉన్న. నా చుట్టూ దప్పులోల్ల కాళ్ల గజ్జెల సప్పుడు మాత్రమే వినిపిస్తుంది.

"ఎంతపనాయె! యాల్లకు ఎట్లయిపాయె" బట్టలుతకడానికచ్చిన శివయ్య మాటలు.

"ఇంక మనకు కనవడుతరా....యాది జేత్తరా! పట్నంల పోయి పడుతరు. గట్టుకు మొరిగిన కుక్క లెక్క అయిపాయె" తలారి మాటలు.

కండ్లు తెరువవోతుంటే నాకు పూర్తిగా సోయి దప్పింది.

(రచన మాసపత్రిక అక్టోబర్ -2003)

(ఆమెరికా సుజనరంజని-2003)

(తెలంగాణ కథ -2003)